సచివాలయాలన్నీ ఖాళీ !

- గందరగోళంగా బదిలీల ప్రక్రియ
- వచ్చేవారి కన్నా వెళ్లేవారు ఎక్కువ
- రిలీవ్ కాకముందే విధులకు ఉద్యోగుల డుమ్మా
- ఇబ్బంది పడుతున్న ప్రజలు


దేమకేతేపల్లి సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

చిలమత్తూరు: గ్రామ సచివాలయాలన్నీ దాదాపు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగులు బదిలీలు పెట్టుకోవడంతో వారి వారి అనుకూల ప్రాంతాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే వారి స్థానాల్లో చేరాల్సిన ఉద్యోగులు రాకపోవడం, బదిలీపై వెళుతున్నామని ప్రస్తుత ఉద్యోగులు విధులకు డుమ్మా కొడుతుండటంతో సచివాలయాలు వెలవెలబోతున్నాయి.

నిబంధనలు బేఖాతరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గ్రామ సచివాలయాల ఉద్యోగులకు సాధారణ బదిలీలకు అవకాశం ఇచ్చింది. అయితే ఆయా స్థానాలు భర్తీ కాక మునుపే మరో చోటుకు వెళ్లిపోతుండటంతో సచివాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీల విషయం కార్యదర్శులకు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. సచివాలయ ఉద్యోగులు బదిలీ అయ్యే ముందు కనీస నిబంధనలు పాటించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యంగా బదిలీ ప్రక్రియ సాగుతోందన్న విమర్శలు వినపడుతున్నాయి.

హిందూపురం నియోజకవర్గంలో ఇలా..			
మండలం	సచివాలయాల సంఖ్య	సచివాలయ ఉద్యోగుల సంఖ్య	బదిలీలకు దరఖాస్తు చేసిన వారి సంఖ్య
చిలమత్తూరు	15	122	60
లేపాక్షి	12	97	04
హిందూపురం	16	126	15

20 మంది ఉండాల్సిన చోట ఆరుగురే..

చిలమత్తూరు మండలంలో మండలంలోని దేమకేతేపల్లి పంచాయితీలో 20 మంది సచివాలయ సిబ్బంది ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆరు మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వారు బదిలీ అవుతున్నామన్న నిర్లక్ష్యంతో విధులకు రావడం లేదు. ఆ స్థానాల్లో ఎవరు చేరుతున్నారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. చిలమత్తూరు మండలంతో పాటు లేపాక్షి, హిందూపురం మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.

గాడితప్పిన బదిలీల ప్రక్రియ

సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గాడి తప్పింది. ఒక సచివాలయంలో పనిచేసే ఉద్యోగి మరొక ప్రాంతానికి బదిలీ అవ్వాలంటే ఖాళీ ఏర్పడిన స్థానం భర్తీ కావాల్సి ఉంటుంది. అయితే ఆ ప్రక్రియకు మంగళం పాడి ఎవరికి అనుకూలం ఉన్నచోటుకి వారు వెళ్లిపోతున్నారు. అయితే ఖాళీ అయిన స్థానాలు మాత్రం భర్తీ కావడం లేదు. సచివాలయంలో 50 - 70 శాతం మేర ఉద్యోగులు బదిలీ అవుతున్నా కనీసం ఒకరిద్దరు కూడా చేరని పరిస్థితులు నెలకొన్నాయి. కొత్తగా చేరిన మండల అధికారులు కూడా సచివాలయ ఉద్యోగుల బదిలీ విషయంలో ఆందోళన చెందుతున్నారు. పింఛన్లు పంపిణీ మొదలు ఇతర ప్రభుత్వ సేవలను అందించేందుకు కనీస సిబ్బంది లేకపోతే ఎలా? అని తలలు పట్టుకుంటున్నారు.

ఆరుగురే పనిచేస్తున్నారు



మాకు రెండు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇప్పటి దాకా 20 మంది సిబ్బంది ఉండేవారు. ప్రజలు ఏ సమస్య మీద వచ్చినా సమస్య పరిష్కారం అయ్యేది. ఇప్పుడు ఆరుగురు మాత్రమే ఉన్నారు. సచివాలయాల్లో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ అయిన స్థానాలు భర్తీ చేస్తారో? చేయరో? కూడా తెలీడం లేదు. రిలీవ్ కాకపోయినా ఉద్యోగులు సచివాలయాలకు రావడం లేదు. బదిలీల పనుల్లో ఉండిపోతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ కొరవడింది. కలెక్టర్ సచివాలయాల బదిలీల ప్రక్రియపై దృష్టి సారించాలి.

– ఈడిగ తిరుమలేష్ , సర్పంచ్, దేమకేతేపల్లి

సిబ్బంది కొరత లేకుండా చర్యలు



చిలమత్తూరు మండలంలో ఇప్పటి వరకూ 20 మంది ఉద్యోగులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నేను కొత్తగా వచ్చాను. బదిలీల్లో మరింత మంది ఉండొచ్చు. ప్రస్తుతం ముగ్గురు సచివాలయ ఉద్యోగులు కొత్తవారు చేరారు. వచ్చేవారి కన్నా వెళ్లేవారు ఎక్కువ ఉన్నారన్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. సిబ్బంది కొరత లేకుండా చూసుకుంటాం. రిలీవ్ అవుతున్నామని బదిలీ ప్రక్రియ పూర్తి కానంతవరకూ ఉద్యోగులు తమ విధులకు విధిగా వెళ్లాల్సిందే. అలా వెళ్లని వారిపై చర్యలు తీసుకుంటాం.

– రమణమూర్తి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, చిలమత్తూరు

క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ


నారాయణరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న చరణ్‌రెడ్డి

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింహరెడ్డి తండ్రి నారాయణరెడ్డి (85) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన పల్లేన్న భార్య కొల్లక్క (65) మంగళవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతుల భౌతికకాయాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ నరసింహులు తదితరులున్నారు.

మట్టి పరీక్షలపై అవగాహన

పావగడ: మట్టి పరీక్షలపై అవగాహన అవసరమని స్థానిక వ్యవసాయశాఖ ఏడీ అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక రాజవంతి వ్యవసాయ పరిశోధన కేంద్రం క్షేత్రోత్సవం, రైతు కిసాన్ గోష్టి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిరు ధాన్యాల సాగు, సాగు పద్ధతి, వంగడాలు, వ్యవసాయ పద్ధతులు తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం విజ్ఞాన వేత్త డా సయ్యద్ మజుర్ అలి, అధికారులు చైత్ర, కార్తీక్, సుజిత్, కృష్ణారెడ్డి, కుమార గోవింద తదితర రైతులు పాల్గొన్నారు.

పర్యాటకులను పెంచడమే లక్ష్యం


లేపాక్షిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీటీఓ

లేపాక్షి: పర్యాటకులను ఆకర్షించడమే కాకుండా పర్యాటకులను పెంచడమే ఏపీ టూరిజంశాఖ లక్ష్యమని, కలెక్టర్ టీఎస్.చేతన్ దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని జిల్లా టూరిజం శాఖ అధికారి జయకుమార్‌బాబు పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని లేపాక్షిలో గురు, శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంప్రదాయ నృత్యాలు, తోలుబొమ్మలాట, సంగీత కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. హరిత హోటల్ అభివృద్ధికి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు తీవ్ర గాయాలు

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ వద్ద కారు ఢీకొని కందుర్పర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వేణుగోపాల్‌రెడ్డికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. బుధవారం ఉదయం కందుర్పర్తి నుంచి చెక్‌పోస్ట్ వైపునకు వెళుతుండగా కొడికొండ వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన కారు.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వేణుగోపాల్‌రెడ్డికి కుడికాలు విరిగిపోగా వెంటనే హిందూపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నవోదయ విద్యార్థికి రాష్ట్రస్థాయి బహుమతి



విద్యార్థినికి చెక్కు, ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న పోస్టల్ సిబ్బంది

లేపాక్షి: యూనివర్సిల్ పోస్టల్ యూనియన్ వారి ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో లెటర్ కాంపిటేషన్ లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతి చదువుతున్న విద్యార్థిని హేమలత తృతీయ బహుమతి సాధించింది. బుధవారం వరల్డ్ పోస్ట్ డే సందర్భంగా ఆ విద్యార్థినికి రూ.5 వేలు చెక్కుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ముంతాజ్‌బేగం సమక్షంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ టీఎస్.మల్లికార్జున, హెడ్ పోస్ట్‌మాస్టర్ మార్కొండేయులు స్థానిక విద్యాలయంలో అందించారు. కార్యక్రమంలో డీఓపీ ఎల్ఐ నరసింహమూర్తి, జబీవుల్లా, వెంకటేష్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మడకశిర - కర్నూలు నూతన బస్సు సర్వీసు ప్రారంభం

మడకశిర: మడకశిర–కర్నూలు మధ్య మరో నూతన బస్సు సర్వీసును గురువారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ రామసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో నూతన బస్సు సర్వీసును ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభిస్తారన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి


అగళి: పొలం పిలుస్తోందిలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ శేఖర్‌నాయక్


అమరాపురం మండలం గౌడనకుంటలో పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

అగళి: మండలంలోని అగళి, ఇరిగేపల్లి గ్రామాల్లో ఏఓ శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ప్రకృతి వ్యవసాయం వైపు రైతులందరూ ఆసక్తి పెంచుకోవాలన్నారు. రసాయనక ఎరువుల వినియోగం తగ్గిస్తూ సేంద్రియ విధానాన్ని అవలంబించాలని తద్వారా మంచి పంటలు పండుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయం అనుబంధంశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అమరాపురం: ప్రస్తుతం కురిసిన వర్షానికి కంది పంట బాగుందని , రైతులు సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడి పొందవచ్చని తమ్మడేపల్లి, గౌడనకుంట వీఏఏలు రాఘవేంద్ర, రమ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గౌడనకుంట గ్రామ సచివాలయం పరిధిలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు.

మడకశిరరూరల్: పంట మార్పిడితో రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ తిమ్మప్ప తెలిపారు. బుధవారం హరేసముద్రం, బేగార్లపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాగి, మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ పంట సాగులో నూతన వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

6,200 హెక్టార్లకు రిజిస్ట్రేషన్

రొళ్ల: మడకశిర నియోజకవర్గం 2024–25 ఆర్థిక సంవత్సరానికి 6,200 హెక్టర్లకు డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఏపీఎంఐపీ ఎంఐఏఓ నరసింహప్ప తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గానికి 2,400 హెక్టర్లు మాత్రమే టార్గెట్ ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ కింద మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఓసీ, బీసీ రైతులకు ఐదెకరాలలోపు భూమి ఉంటే 90 శాతం సబ్సిడీతో ఆపై 10 ఎకరాల్లోపు భూమి ఉంటే రైతులకు 75 శాతం సబ్సిడీతో అందిస్తామన్నారు.

స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు: మండలంలోని బైరేకుంట వద్ద ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయంలో స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ పద్మప్రియ తెలిపారు. ఈనెల 15వ తేదీ సాయంత్రంలోపు మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కేంద్రంలో మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరీ వారు 18–42 సంవత్సరాలలోపు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు 47 సంవత్సరాలలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

శుభకార్యం

మడకశిర: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నగేష్ నూతన గృహ ప్రవేశం బుధవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పాల్గొని నగేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నాలుగు మద్యం షాపులకు దరఖాస్తులు నిల్

మడకశిర: నియోజకవర్గంలో మద్యం షాపులకు బుధవారం నాటికి 40 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 10 మద్యం షాపులు ఏర్పాటు కానున్నాయని, ఇందులో 6 మద్యం షాపులకు మాత్రమే 40 దరఖాస్తులు వచ్చాయన్నారు. మడకశిరరూరల్ మండలంలోని రెండు షాపులు, అమరాపురం, గుడిబండ మండలాల్లోని ఒక్కొక్క షాపుకు ఇంత వరకూ ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్నారు. మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 11వ తేదీ వరకూ గడువు ఉందన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

రొళ్ల: కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధికారం చేపట్టి 5 నెలలు కావస్తున్న రైతులకు ఏమాత్రం మేలు చేయలేదని విమర్శించారు. వెంటనే సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలతో పాటు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి మోసగించారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అందించి లబ్ధిదారులను ఆదుకోవాలన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ పరిశీలన


ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం, మల్లాపల్లి, గోరంట్ల ,పులేరు, మలసముద్రం గొనివారిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో బుధవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల పొలల్లో గతంలో వ్యవసాయ అధికారులు నిర్వహించిన ఈ క్రాప్ బుకింగ్ జాయింట్ కలెక్టర్ క్రాస్ చెక్ చేశారు. వ్యవసాయ అధికారులు చేసిన ఈ క్రాప్ బుకింగ్ రికార్డులతో పాటు క్షేత్రస్థాయిలో పంటల సాగు, దిగుబడిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్ పారదర్శకంగా నిర్వహించాలని, ఎక్కడైనా తేడాలు వస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో హిందూపురం డివిజన్ అగ్రికల్చర్ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్, మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ, తహసీల్దార్ మారుతీ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

హిందూపురం: పోస్టల్‌శాఖ వారోత్సవాలను పురస్కరించుకుని ఆ శాఖ ఉద్యోగులు బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పోస్టల్ ఏఎస్పీ మల్లికార్జున మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ వరకూ పోస్టల్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులు సక్రమంగా నిర్వహించలరన్నారు. పోస్టుమాస్టర్ మార్కండేయులు మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం, నడక యోగా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్ పోస్ట్ ఆఫీస్, డివిజన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

హిందూపురం: ప్రజలకు అనుకులంగా ఉండేలా ఆధార్ సేవలు అందిస్తున్నామని పోస్టల్ ఏఎస్పీ మల్లికార్జున, హెడ్ పోస్ట్‌మాస్టర్ మార్కండేయులు తెలిపారు. అక్టోబర్ 10న గురువారం ప్రీకార్డ్ మిల్ గొల్లెపల్లి, మధుగిరి రోడ్డు వద్ద ఆధార్ సేవా కేంద్రాన్ని తపాలాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిల్లులో పనిచేసే కార్మికులు ఉద్యోగులు, చుట్టుపక్కల నివసించే ప్రజలు ఆధార్‌లో మార్పులు, చేర్పులతో పాటు నూతన ఆధార్‌కార్డు పొందవచ్చన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


తీవ్రంగా గాయపడిన ఆదినారాయణ

హిందూపురం అర్బన్: పట్టణంలోని ధర్మపురం సమీపంలో నివాసం ఉంటున్న ఆదినారాయణ (58) జీవితంపై విరక్తి చెంది బుధవారం వేకువ జామున గడ్డం సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించాడు. కొన ఊపిరితో ఉన్న అతన్ని వెంటనే రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్, సిబ్బంది హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ఆదినారాయణ భార్య రంగమ్మ ఆస్పత్రికి చేరుకొని గాయపడిన అతన్ని బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉండగా కుమార్తెకు వివాహమైనట్లు పేర్కొన్నారు.

వివాహేతర సంబంధంతోనే మహిళ అదృశ్యం?

పెనుకొండ: వివాహేతర సంబంధంతోనే పట్టణంలోని సీపీఐ కొట్టాలకు చెందిన పద్మావతి (44) కుమార్తె స్నేహ (8) అదృశ్యం అయ్యారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మంగళవారం సాయంత్రం వారిద్దరూ అదృశ్యమయ్యారు. ఈ నేపథ్యంలో భర్త వెంకటేష్ బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భర్త వెంకటేష్ ఇచ్చిన సమాచారంతో పద్మావతితో సన్నిహితంగా ఉండే వ్యక్తిని పోలీసులు ఫోన్ ద్వారా మాట్లాడి స్టేషన్‌కు రావాలని గట్టిగా హెచ్చరించినట్లు తెలిసింది.

ప్రభుత్వ మోసాలను ఎండగట్టండి


మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు

పెనుకొండ: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర అధ్యక్షుడు వేమన పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రొద్దం శివకుమార్, జిల్లా నాయకులు పరశురాముడు, సుజాత తదితరులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అలవకాని హామీలు ఇచ్చి, నేడు ప్రజల ఆశలను ఆవిరి చేస్తోందని విమర్శించారు. రొద్దం మండల కన్వీనర్‌గా నాగార్జున, కోకన్వీనర్‌గా మురళితో పాటు మరో 9 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


కరాటే బెల్టులను ప్రదానం చేస్తున్న సీఐ రాజగోపాల్‌నాయుడు

హిందూపురం టౌన్: కరాటే విద్య ఆత్మరక్షణకు, జీవన శైలికి ఎంతగానో దోహదం చేస్తుందని వన్ టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు అన్నారు. బుధవారం పట్టణంలోని మనస్వి పాఠశాల ఆవరణలో స్థానిక కరాటే ఇన్‌స్ట్రక్టర్ సెన్సెయి ఫైరోజ్ ఆధ్వర్యంలో కరాటేలో శిక్షణ పొందిన 70 మంది విద్యార్థులకు కరాటే బెల్ట్ పరీక్షను నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ రాజగోపాల్‌నాయుడు అతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ మృతి



మడకశిరరూరల్: మండల పరిధిలోని గుర్రపుకొండ గ్రామానికి చెందిన రైతు రంగనాథ్ (46) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రంగనాథ్ ప్రకృతి వ్యవసాయంలో అమరాపురం మండలంలో యూనిట్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. ఉదయం విధులకు హాజరు కావడానికి వెళ్తుండగా అమరాపురం పట్టణ సమీపంలోకి రాగానే గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, సిబ్బంది స్వగ్రామానికి వెళ్లి రంగనాథ్ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.


టమాటాలతో కళకళలాడుతున్న రైతు హనుమంతేగౌడ్ తోట


టమాట రైతులకు ఊరట


మడకశిరరూరల్: మండంలోని వివిధ గ్రామాల్లో రైతులు అప్పులు చేసి సాగు చేసిన టమాట పంట చేతికందే సమయంలో ధర పెరగడంతో పెట్టిన పెట్టుబడి వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి పంటలో టమాట చెట్టు నిండా కాయలు ఉన్నాయని, దిగుబడి కూడా బాగా వస్తుందని చెబుతున్నారు. గతంలో టమాట పంట సాగు చేసిన పంట దిగుబడి బాగా వచ్చినా ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని జక్కేపల్లి, హెచ్‌ఆర్‌పాళ్యం, కదిరేపల్లి, సింగేపల్లి, కంబాలపల్లి తదితర గ్రామాల రైతులు తెలిపారు.

చదువుల తల్లికి వందనం

శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులతో సందడిగా మారుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవార్లను, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వగా మొక్కులు చెల్లించుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయి.

– సాక్షి బృందం


హిందూపురం: సరస్వతీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


చదువులతల్లిగా మోడల్ కాలనీలో గంగమ్మదేవి


పెనుకొండ: సరస్వతీదేవిగా వాసవీ మాత


రొద్దం: సరస్వతీదేవి అలంకరణలో రేణుకా యల్లమ్మ


మడకశిర: చదువుల తల్లిగా వడిసిలమ్మ


రొళ్ల : మహాకాళి రూపంలో కాళికాంబ


అమరాపురం: అలంకరణలో శ్రీదేవి


పావగడ: దానిమ్మ గింజల అలంకరణలో దుర్గాదేవి